క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం



టేకుమట్ల: విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని వెలిశాలలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడు పోతుగంటి లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఇంట్లోని ఫ్యాన్ నుంచి మంటలు వచ్చి ఇంటి పైకప్పుకు అంటుకుందని తెలిపారు. వెంటనే స్పందించిన స్థానికులు ఆర్పేందుకు ప్రయత్నించినా మంటలు వ్యాపించడంతో ఇంట్లోని రూ.10వేల నగదు, 18తులాల వెండి పూర్తిగా కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. సమాచారం అందుకున్న ఆర్ఐ సంతోష్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా చేశారు.

సన్మానం



రేగొండ: కొత్తపల్లిగోరి మండలానికి నూతన మండల విద్యాధికారిగా సట్కూరి రాజు ఇటీవల బాధ్యతలు చేపట్టడంతో సోమవారం మండల పీఆర్టీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. పీఆర్టీయూ మండల అధ్యక్షుడు దుస్స సధాకర్, ప్రధాన కార్యదర్శి కొమ్మిరెడ్డి మధుకర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు మాధవిలత, ఉపాధ్యాయులు కృష్ణ, రంజాన్, భిక్షపతి, రఘు, నవీన్, శిరీష, శ్యామ్ సుందర్ రెడ్డి, బండి విజేందర్, రాజమొగిలి, సహదేవ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

టేకుమట్ల: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో ఆరు నుంచి 10వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లీష్ బోధించేందుకు తాత్కాలిక పద్ధతిలో పని చేసేందుకు మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఓ స్వప్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత డిగ్రీ బీఎడ్ పూర్తి చేసి, టెట్ క్వాలీఫై అయిన వారు అర్హులని, ఆసక్తి గల అభ్యర్థులు నేడు, రేపు (మంగళ, బుధవారం) కస్తూరిబా బాలికా విద్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు.

క్రీడా మైదానం పరిశీలన



కాటారం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల కళాశాల క్రీడా మైదానాన్ని ఎంపీడీఓ అడ్డూరి బాబు, ఎంపీఓ వీరస్వామి సోమవారం పరిశీలించారు. నేటి (మంగళవారం) నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు క్రీడా పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. అన్ని పాఠశాలల పీడీ, పీఈటీలు క్రీడా పోటీల పర్యావేక్షణలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. క్రీడా పోటీల నిర్వహణ కోసం క్రీడా మైదానాన్ని స్థానిక గిరిజన కళాశాల, ప్రభుత్వ పాఠశాల పీడీ, పీఈటీలతో చర్చించారు.

క్షుద్ర పూజల కలకలం



చిట్యాల : మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన ఆరెపల్లి ఎల్లయ్య ఇంటి ఎదుట ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్రపూజలు కలకలం లేపాయి. సోమవారం కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. ఆదివారం రాత్రంతా ఇంట్లోనే నిద్రించామని తెల్లవారుజామున లేచే సరికి ఇంటి ఎదుట కోడిని కోసి గుండ్రంగా భూమికి రక్తాన్ని చుట్టూ రాసి దానిపై పసుపు, కుంకుమలతో ముగ్గులు వేసి నిమ్మకాయ పెట్టారని తెలిపారు. దీంతో గ్రామస్తులకు సమాచారం అందించి అందరికి చూపించామని పేర్కొన్నారు. ఇంటి యాజమాని ఎల్లయ్య మాట్లాడుతూ గత కొంత కాలం నుంచి నా ఆరోగ్యం బాగా లేదని దీంతో నేను ఇంట్లోనే ఉంటున్నానని చెప్పాడు. ఎవరో కావాలనే నాపై, నా ఇంటి ఎదుట క్షుద్ర పూజలు చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. క్షుద్రపూజలు చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకొని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ-పంచాయతీ సేవలేవి?

- గ్రామ పంచాయతీల్లో పని చేయని కంప్యూటర్లు
- ప్రభుత్వ ఆశలను నీరుగారుస్తున్న అధికారులు



ఎంపీడీఓ కార్యాలయంలో డేటా ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్

మల్హర్: గ్రామ పంచాయతీల పాలనలో పారదర్శకతను తెచ్చేందుకు 2015లో అమలుచేసిన ఈ పంచాయతీ వ్యవస్థ అధికారుల నిర్లక్ష్యం మూలంగా అటకెక్కింది. దీంతో పౌరసేవలు అందకుండా పోయాయి. ఈ-పంచాయతీ వ్యవస్థలో భాగంగా ప్రతీ గ్రామ పంచాయతీకి రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కింద కంప్యూటర్లను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. అయితే ప్రస్తుతం కంప్యూటర్లన్నీ చాలా గ్రామాల్లో పనిచేయడం లేదు. మరికొన్ని జీపీలకు చెందిన కంప్యూటర్లు మండల పరిషత్ కార్యాలయానికే పరిమితమయ్యాయి.

తొమ్మిది ఏళ్లుగా ఎక్కడివక్కడే..

గ్రామ పంచాయతీలను ఈ-పంచాయతీలుగా తీర్చి దిద్దేందుకు 2015లో జిల్లాలోని గ్రామపంచాయతీలకు కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లతో పాటుగా అందుకు అనుకూలమైన టేబుళ్లు, కుర్చీలను సైతం ప్రభుత్వం సరఫరా చేసింది. అందులో భాగంగానే మండలాల్లోని తాడిచర్ల, మల్లారం, పెద్దతూండ్ల, రుద్రారం, నాచారం, వల్లెకుంట గ్రామపంచాయతీలకు కంప్యూటర్లు, ప్రింటర్లు చేరాయి. క్లస్టర్ వారీగా కంప్యూటర్ ఆపరేటర్ల నియామకం చేపట్టినా అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఇంటర్‌నెట్ కనక్షన్ సౌకర్యం సదుపాయాన్ని కల్పించ లేకపోయారు. అయితే గడిచిన 9 ఏళ్లుగా గ్రామ పంచాయతీలకు సరఫరా చేసిన కంప్యూటర్లకు ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడంతో ఈ-పంచాయతీ నామమాత్రంగా కొనసాగుతూ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా మారిపోయింది. మండలంలో 10 ఉమ్మడి జీపీ లకు ఈ పంచాయతీ కోసం టీ-ఫైబర్ ఇంటర్నెట్ కనక్షన్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే అందుకు సంబంధించిన పాస్వర్డ్, లాగిన్ సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శులకు ఇవ్వకపోవడంతో ఈ పంచాయతీ సేవలు అందని ద్రాక్షగానే మారిపోయాయి.

మండల పరిషత్ కేంద్రంగా డేటా నమోదు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ-పంచాయతీ అప్లికేషన్‌లో గ్రామ పంచాయతీల వారీగా నెలవారీ డేటాను నమోదు చేయడానికి మండల పరిషత్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ విధానం ద్వారా ఇద్దరు ఆపరేటర్లను నియమించి నమోదు చేయిస్తున్నారు. ప్రస్తుతం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఓ ఆపరేటర్ డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతానికి వెళ్లడంతో ఒకే ఆపరేటర్ పని చేస్తున్నాడు. అన్ని గ్రామపంచాయతీల్లో ఇంటర్నెట్ డివైజ్ ఇన్‌స్టాల్ చేసినప్పటికీ అందుకు అవసరమైన సాంకేతిక సాయాన్ని గానీ, వసతులను గానీ కేటాయించకపోవడంపై ఈ-పంచాయతీ సేవలన్ని మండల పరిషత్ నుంచే కొనసాగతోండటం గమనార్హం. దీంతో వివిధ సర్టిఫికెట్ల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి గ్రామ పంచాయతీల్లో ఈ పంచాయతీ సేవలు కొనసాగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్నో ప్రయోజనాలు..

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-పంచాయతీ క్షేత్రస్థాయిలో అమలు జరిగితే గ్రామాల్లోనే అనేక రకాల సాంకేతిక పరమైన పౌరసేవలతో పాటుగా బహుళ ప్రయోజనాలు ఉంటాయి. ప్రధానంగా పంచాయతీకి చెందిన ఆదాయ, వ్యయాలను ఆన్‌లైన్ అప్‌డేటింగ్, జనన, మరణాల నమోదు, కంప్యూటరీకరణ ధ్రువీకరణ పత్రాలు అందజేత, ఆసరా పింఛన్లు, రేషన్ కార్డులు, ఈజీఎస్ జాబ్ కార్డుల దరఖాస్తులు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు నేరుగా చేసుకునే వెసులుబాటు అందుబాటులోకి వస్తుంది.

లేబర్ అడ్డాలు ఏర్పాటు చేయాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుదుల వెంకటేష్



మాట్లాడుతున్న వెంకటేశ్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలో బిల్డింగ్ రంగంలో పనిచేస్తున్న భవన నిర్మాణ రంగ కార్మికులకు లేబర్ అడ్డాలు ఏర్పాటు చేయాలని బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుదుల వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా భవన నిర్మాణ రంగంలో పనిచేస్తూ వారి వారి కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. కాళేశ్వరంలో కార్మికుల సంఖ్య పెరుగుతున్న తరుణంలో వారికి కావలసిన ఏర్పాట్లు కార్మికులకు అడ్డాలు లేకుండా రోడ్లపైనే కార్మికులు విచ్చలవిడిగా ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల పక్షాన ఉండాల్సిన లేబర్ అధికారులు కనీసం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరంలో ఉన్న కార్మికులను వారి సమస్యలు అడిగి తెలుసుకుని భవిష్యత్‌లో ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వారికి హామీ ఇచ్చారు. అనంతరం నూతన కమిటీ వేశారు. కార్యక్రమంలో బొల్లి శ్రీను అశోక్, రాజబాబు, రాజన్న, దుర్గ రాజు, శంకర్, సారయ్య శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహం ఏర్పాటు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

టేకుమట్ల: ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకుంటున్న నిరుపేద విద్యార్థుల కోసం మండల కేంద్రంలో వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో కొనసాగిన ప్రజావాణిలో తహసీల్దార్ విజయలక్ష్మీకి ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు వినతిపత్రాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులు ఆర్థిక పరిస్థితుల కారణంగా చదువును మధ్యలోనే నిలిపివేసి ఉపాధి కోసం కూలీ పనులకు వెళ్లి వారి విలువైన జీవితాన్ని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు స్పందించి వసతి గృహ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మచ్చ శ్రీకాంత్, అనిల్, రాంచందర్, గంధం రాజు, శంకర్ ఉన్నారు.

పెరిగిన వేతనాలు చెల్లించాలి

- కోసరి భాస్కర్



వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

భూపాలపల్లి రూరల్: అన్‌మ్యాన్డ్ వర్కర్లకు పెరిగిన వేతనాలకు అనుగుణంగా స్కిల్డ్ వేతనం రూ.15,660 చెల్లించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ అనుబంధం జిల్లా అధ్యక్షుడు కోసరి భాస్కర్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఎస్ఈ మల్సూర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ ప్రస్తుతానికి అన్‌మ్యాన్డ్ వర్కర్లకు పెరిగిన వేతనాలకు అనుగుణంగా స్కిల్డ్ వేతనం రూ. 15660 ఇవ్వాల్సి ఉండగా ప్రస్తుతానికి కాటారం సబ్‌డివిజన్, భూపాలపల్లి సబ్ డివిజన్, చిట్యాల సబ్‌డివిజన్ కాంట్రాక్టర్లకు రూ. 14 వేలు ఇస్తూ కార్మికుల పొట్టగొడుతున్నారన్నారు. కార్మికులకు ఎటువంటి కటింగ్‌లు లేకుండా వేతనాలు నేరుగా బ్యాంక్ అకౌంట్‌లో వేయాలని, అధికారులను వేడుకుంటున్నామన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో యూనియన్ నాయకులు సమ్మయ్య, సురేష్, రవీందర్, తదితర కార్మికులు ఉన్నారు.

జీపీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి



రేగొండ : వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు



చిట్యాల : ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

రేగొండ : పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీఓ వెంకటేశ్వరరావుకు, ఎంపీఓ రాంప్రసాద్‌కు మండలంలోని కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాంబాబు మాట్లాడుతూ గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులుగా ఏడాది కాలం పూర్తయినందున ప్రొబెషన్ పీరియడ్ డిక్లేర్ చేస్తూ జీఓ విడుదల చేయాలన్నారు. గ్రామపంచాయతీలను గ్రేడ్‌లుగా పునర్వ్యవస్థీకరించి సీనియారిటీ ఆధారంగా ప్రమోషన్లు కల్పించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే నుంచి కార్యదర్శులను మినహాయించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తుల్జారాణి, జీవిత, రమేశ్, కుమార్, తిరుపతి, శంకర్, రంజిత్, స్రవంతి, జ్యోతి, పద్మ, మమత, సరిత తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: పంచాయితీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ జయశ్రీకి పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు కంకణాల వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ ఇళ్లకు అర్హులను గుర్తించే బాధ్యతను ఇందిరమ్మ గ్రామస్థాయి కమిటీకి అప్పగించాలని అన్నారు. కార్యక్రమంలో మండల పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మల్హర్: తమ సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులు తెలంగాణ పంచాయతీ సెక్రటరీ ఫెడరేషన్ (టీపీఎస్‌ఫ్) మండల అధ్యక్షుడు చెలకల రాజు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ ఓ. శ్యాంసుందర్‌కు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం వినతిపత్రం ఇచ్చారు. తమ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎంపీడీఓ చెప్పడం జరిగిందని కార్యదర్శులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు మల్లికార్జున్, సతీష్, సాయి చరణ్, భాస్కర్ రెడ్డి, శివకుమార్, దేవేందర్ రెడ్డి, శరత్‌చంద్ర, సునీత, రజిత పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన ఆకాంక్ష గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతోంది. చికిత్స నిమిత్తం వారికి ప్రభుత్వం నుంచి విడుదలైన రూ.2.50 లక్షల చెక్కును సోమవారం రాత్రి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హైదరాబాద్ సెక్రటరీలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు ఎల్‌ఓసీ ద్వారా ప్రాణదానం చేస్తున్నామన్నారు.ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.51వేలు వితరణ



అర్చకుడికి చెక్కు అందిస్తున్న దాతలు

గణపురం: మండలకేంద్రంలోని పట్టాభిరామచంద్ర స్వామి ఆలయంలో రేకుల షెడ్డు నిర్మాణానికి గణపురం గ్రామానికి చెందిన సూర్యదేవర ప్రవంతికార్తీక్ దంపతులు రూ.51 వేలను విరాళంగా సోమవారం అందించారు. కార్తీక్ అతడి తండ్రి సూర్యదేవర ప్రకాశం గుప్తా స్మారకార్థం నగదును వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తాళ్లపెల్లి గోవర్ధన్ గౌడ్, ఆలయ అర్చకులు మునునూరి నరేష్ కుమార్, వెంకన్న, పోషాల కిషోర్, మార్క రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభం



బాలాజీనగర్‌లో సర్వే చేస్తున్న అధికారులు

గోవిందరావుపేట: ఇందిరమ్మ ఇళ్ల సర్వే మండలంలో ప్రారంభమైంది. ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న ఇందిరమ్మ ఇళ్ల యాప్ అందుబాటులోకి వచ్చింది. సర్కార్ అందించే ఇళ్ల కోసం లబ్ధిదారులను ఈ యాప్ ద్వారానే గుర్తిస్తారు. మండలంలో చల్వాయి, బాలాజీ నగర్, పస్రా, రాంనగర్, దుంపెల్లిగూడెం, గోవిందరావుపేట గ్రామ పంచాయితీల్లో సర్వే చేస్తున్నారు. అధికారులు, సర్వేయర్లతో కలిసి గ్రామాల్లో దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. లబ్ధిదారుల గుర్తింపులో భాగంగా ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తుదారుల ఇంటికి వివరాలు నమోదు చేస్తున్నారు. సర్వేను ఆయా జీపీ కార్యదర్శులు పర్యవేక్షిస్తున్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



చిట్యాల: పదవ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ బుక్స్‌ను వరంగల్ రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు రవ్వ జగదీశ్ ఆధ్వర్యంలో ఎంఈఓ కొడెపాక రఘుపతి చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగదీశ్ మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు 50 పాఠశాలలకు ఆల్‌ఇన్ వన్ బుక్స్ రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ వారి సాయంతో అందించడం జరిగిందని పేర్కొన్నారు. అందులో భాగంగా మండలంలోని గోపాలపూర్, చిట్యాల ఉన్నత పాఠశాలాలకు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మారబోయిన మహేందర్, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- ఎస్సై అశోక్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై అశోక్

మొగుళ్లపల్లి : రౌడీషీటర్లు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని స్థానిక ఎస్సై అశోక్ అన్నారు. సోమవారం మండలంలోని రౌడీషీటర్లకు పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్ అంటూ ప్రజలను బెదిరింపులకు గురి చేసినా, అక్రమ వసూళ్లకు పాల్పడినా, అల్లర్లు, అలజడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. రౌడీషీటర్లపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. నాయకుల, అధికారుల పేర్లు చెప్పి బెదిరిపులకు గానీ, డబ్బులు వసూళ్లకు గానీ పాల్పడితే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. రౌడీషీటర్ల కదలికలపై ఏదైనా అనుమానం వస్తే వెంటనే అదుపులోకి తీసుకుని బైండోవర్ చేస్తామన్నారు.

విద్యార్థుల ప్రతిభను గుర్తించాలి



చిట్యాల: పేపర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ



కాటారం: ఆత్మికను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

- మండల విద్యాధికారి రఘుపతి

చిట్యాల: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించాలని మండల విద్యాధికారి కొడెపాక రఘుపతి అన్నారు. మండల కేంద్రంలో తెలంగాణ బయోసైన్స్ ఫోరం ఆధ్వర్యంలో మండల స్థాయి బయోసైన్స్ టాలెంట్ టెస్ట్‌ను సోమవారం ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా బయోసైన్స్ టాలెంట్ టెస్ట్ పేపర్‌ను ఎంఈఓ రఘుపతి ఆవిష్కరించి మాట్లాడారు. మానవుడి జీవన విధానం బయోసైన్స్ పైనే ఆధారపడి ఉందని అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో ఇలాంటి టాలెంట్ టెస్ట్‌లు దోహదపడుతుందని తెలిపారు. అనంతరం టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బయోసైన్స్ ఫోరం కన్వీనర్‌లు కూచనపల్లి శ్రీనివాస్, బిట్ల సరళదేవి, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీరాం రఘుపతి, ఫిజికల్ డైరెక్టర్ సూదం సాంబమూర్తి పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థిని ప్రతిభ

కాటారం: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి బయోసైన్స్ టాలెంట్ టెస్ట్‌లో స్థానిక కేజీబీవీ విద్యార్థిని ఆత్మిక ప్రతిభ కనబర్చింది. జెడ్పీహెచ్‌ఎస్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సమ్మయ్య, ఉపాధ్యాయులు దారం వెంకటేశ్వర్లు, గండు రాజబాబు, కేజీబీవి ప్రత్యేకాధికారి చల్ల సునీత విద్యార్థిని అభినందించి బహుమతి అందజేశారు.

ఫిర్యాదులను పట్టించుకోని అధికార యంత్రాంగం

కాటారం: రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు ఇలాఖాలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఫిర్యాదు చేస్తే కలెక్టర్, అధికారులు పట్టించుకోవడం లేదని మండల కేంద్రానికి చెందిన రామిళ్ల రాజబాబు ఒక ప్రకటనలో ఆరోపించారు. కొన్ని నెలలుగా కాటారం సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రభుత్వ శాఖల్లో చోటు చేసుకుంటున్న అవినీతి, అక్రమాలు, పలువురు అధికారుల తీరుపై ఆధారాలతో సహా జిల్లా కేంద్రంలో జరిగిన ప్రజావాణి, హైదరాబాద్‌లోని పూలేభవన్‌లో అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయం అధికారులు ఫిర్యాదులను సదరు అవినీతికి పాల్పడుతున్న వారికే నేరుగా పంపిస్తూ వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. దీంతో సదరు అవినీతిపరులు ఫోన్లలో, నేరుగా తమపై బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. ఫిర్యాదుదారులకు రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. ఫిర్యాదులను గోప్యంగా ఉంచి విచారణ చేపట్టాల్సిన అధికారులే అవినీతిపరులకు వంతపాడటం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఫిర్యాదులపై పారదర్శకంగా విచారణ జరిపి అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బియ్యం అందిస్తున్న నాయకులు



పరామర్శిస్తున్న తిరుపతిరెడ్డి

టేకుమట్ల: మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన మారెపెల్లి పోచమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత సభ్యులను ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం పరామర్శించి, 50కిలోల బియ్యం అందజేశారు. జిల్లా అధ్యక్షులు చంద్రమౌళి, సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేశ్, సోముల శ్రీనివాస్, ఆదిత్య, రొంటాల సంపత్, రాంచందర్ ఉన్నారు.

రఘువరెడ్డిపేటలో..

మండలంలోని రాఘవరెడ్డిపేట గ్రామానికి చెందిన దూడపాక లింగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి సోమవారం పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఉప సర్పంచ్ వంగ రాంబాబు, బాబు, రాజు, తదితరులు ఉన్నారు.

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను సోమవారం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రం ఇచ్చి తెలంగాణ ప్రజల కలను నిజం చేసిన వ్యక్తి సోనియా గాంధీ అన్నారు.

\- సాక్షి నెట్‌వర్క్



కాటారం: కేక్ కట్ చేస్తున్న నాయకులు



భూపాలపల్లి రూరల్: సోనియాగాంధీ జన్మదిన వేడుకల్లో నాయకులు



కాళేశ్వరంలో..



టేకుమట్లలో..



చిట్యాలలో..